# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-10-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బందికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాళులర్పించారు.**

**2. ప్రజల రక్షణ కోసం ముందుండేది పోలీసులేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొనియాడారు.**

**3. సముద్ర ఉత్పత్తుల ఎగుమతిలో ఆంధ్రప్రదేశ్ భారత్‌లో అగ్రగామిగా ఉందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు.**

**4. ప్రపంచవ్యాప్తంగా అయోడిన్ లోపం రుగ్మత దినోత్సవాన్ని ఈరోజు పాటిస్తున్నారు.**

==========================

విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బందికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మధ్యమం ఎక్స్ వేదికగా ఈరోజు నివాళులర్పించారు. ప్రజల భద్రత కోసం పోలీసులు చూపుతున్న అచంచల నిబద్ధత అభినందనీయమని కొనియాడారు. సంక్షోభ సమయంలో, అవసరమైన వేళల్లో వారు ప్రదర్శించే ధైర్యసాహసం, త్యాగ భావం నిజంగా ప్రశంసనీయమని పేర్కొన్నారు.

---------------------------

ప్రజల రక్షణ కోసం ముందుండేది పోలీసులేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని 6వ బెటాలియన్‌లో పోలీసు అమర వీరుల సంస్మరణ దినం ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'అమరులు వారు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

పోలీసుల సేవలు అమోఘమని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని 6వ బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా రక్షణ కోసం పోలీసులు ప్రాణత్యాగం చేశారని చెప్పారు. ప్రజలు పోలీసులకు

సహకరించాలని మంత్రి అనిత కోరుతూ..

వాయిస్ .. 26 సెకన్లు

---------------------------

దేశ అంతర్గత రక్షణలో అమరులైన పోలీసు సిబ్బంది త్యాగాలు అజరామరమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు ఒంగోలులోని పోలీసు కవాతు మైదానంలోని అమర వీరుల స్థూపం వద్ద ఆయన జిల్లా అధికారులు, శాసన సభ్యులతో కలిసి నివాళులర్పించారు.

---------------------------

ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లకు కరువు భత్యం – డీఏను మంజూరు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఉత్తర్వులు నిన్న జారీ చేశారు. గత ఏడాది జనవరి 1 నుంచి కరువు భత్యాన్ని 3.64 శాతం పెంచుతున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఉద్యోగుల వేతనంలో ఇప్పటి వరకు కరువు భత్యం శాతం 33.67 ఉండగా.. తాజా పెంపుతో అది 37.31 శాతానికి చేరింది.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా దుబాయ్, అబుదాబి, యూఏఈలలో పర్యటిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. విశాఖపట్నంలో జరగనున్న భాగస్వామ్య సదస్సుకు అంతర్జాతీయ సంస్థలను ఆహ్వానించేందుకు ముఖ్యమంత్రి వెళుతున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, పలు కీలక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఈ పర్యటనలో వెళ్లనున్నట్లు పేర్కొన్నాయి.

---------------------------

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఈరోజు సీఫుడ్ ఇండస్ట్రీ ఆస్ట్రేలియా ప్రతినిధులు, ఆ సంస్థ సీఈవో వెరోనికా పాపకోస్టా, ఎస్ఐఏ ఎంగేజ్ మెంట్ మేనేజర్ జాస్మిన్ కెల్లేలతో సిడ్నీ సమీపాన పారమట్టాలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... సముద్ర ఉత్పత్తుల ఎగుమతిలో ఆంధ్రప్రదేశ్ భారత్ లో అగ్రగామిగా ఉందన్నారు. ఆస్ట్రేలియా, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కొనుగోలుదారులతో ఆంధ్రప్రదేశ్ సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులను అనుసంధానించేందుకు ట్రేడ్ మిషన్లు, నెట్ వర్కింగ్ కార్యక్రమాలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

అనంతరం వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీని సందర్శించారు. యూనివర్సిటీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, అగ్రి కల్చరల్ టెక్నాలజీ పరిశోధకులతో మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ ఆధునీకరణకు వాతావరణ నిరోధక పంటలు, ప్రెసిషన్ ఫార్మింగ్‌లో నైపుణ్యాలను ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కలిసి పంచుకోవాలని కోరారు.

---------------------------

కేంద్రప్రభుత్వం జిఎస్టిని తగ్గించడంపై తిరుపతి జిల్లా ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు చెబుతున్నారు. ముఖ్యంగా ఇన్సూరెన్స్‌లపై జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం తీసివేయడం ఏజెంట్లు, ప్రజలు స్వాగతిస్తున్నారు. ఇన్యూరెన్స్‌లపై జిఎస్టిని తీసివేయడంతో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసే వారి సంఖ్య కూడా పెరుగుతోందని తిరుపతి జిల్లాకు చెందిన ఇన్సూరెన్స్ ఏజెంట్ బాబూరావు తెలుపుతూ..

వాయిస్.. 15 సెకన్లు

---------------------------

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. భారీ వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని, ఇప్పటికే వేటకు వెళ్ళిన వారు వెంటనే తీరానికి చేరుకోవాలని సూచించారు. తీర ప్రాంత మండలాల్లోని అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు.

---------------------------

దక్షిణ అండమాన్ సముద్రం, ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని, దీని ప్రభావంతో రానున్న 24 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈరోజు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ..

..వాయిస్..20 సెకన్లు

---------------------------

అయోడిన్ వినియోగం ప్రాముఖ్యత, ఆరోగ్యంపై దాని ప్రభావం గురించి అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం అక్టోబర్ 21వ తేదీన ప్రపంచవ్యాప్తంగా అయోడిన్ లోపం రుగ్మత దినోత్సవాన్ని పాటిస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ పిల్లల అత్యవసర నిధితో సహా వివిధ స్థానిక, జాతీయ, అంతర్జాతీయ ఆరోగ్య సంరక్షణ సంస్థలు అవగాహన కల్పించడానికి అనేక కార్యక్రమాలు, ప్రచారాలు, విద్యా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లను నిర్వహిస్తున్నాయి.

======================